మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# టెట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

◆ ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలి : గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు8 ప్రభాత వార్త:** ఈనెల 15న జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ అధికారులతో టెట్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 34 పరీక్ష కేంద్రాలలో 13255 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు. మొదటి పేపర్ ఉదయం 9.30 గం.ల నుండి 12గం.ల వరకు, రెండవ పేపర్ 2.30 గం.ల నుండి 5 గం.లవరకు జరుగు తుందని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాలవద్ద త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలో ఎలాంటి కాపీయింగ్ జరగకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణకు సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రలకు చేరవేసేందు కు ఉదయం 8.30 గం.ల వరకు ఆర్టీసి బస్సులు సిద్ధంగా ఉండాలని 9 గం.ల లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు వారి హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.పరీక్ష జరిగిన సమయంలో పూర్తయ్యే వరకుబందోబస్తు నిర్వహించి ఓఎంఆర్ పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి హైదరాబాద్ వచ్చే వరకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల దగ్గర ఆశా వర్కర్లు,ఎఎన్ఎంలు మెడికల్ కిట్స్‌తో అందు బాటులో ఉండి వైద్య సేవలుఅందించాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగాటెట్ పరీక్షలునిర్వహించేలా రెవెన్యూ,విద్య, వైద్య, పోలీస్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ చీర్ల శ్రీనివాస్, డిఇఓ సిరా జుద్దిన్,శ్రీనివాస్,డిప్యూటి డిఎంహెచ్‌ఓసిద్ధప్ప, ఆర్డీఓచంద్రకళ,సంబంధితఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

■ టెట్ పరీక్షలకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
■ వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 8,ప్రభాతవార్త:** జిల్లాలో సెప్టెంబర్ 15వ తేదిన జరిగే టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికా రులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం ఐ.డి.ఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యా శాఖాధికారి ఆధ్వ ర్యంలో టెట్ పరీక్షల నిర్వహణ. ఏర్పాట్లపై జరిగిన సమన్వయ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెట్ పరీక్షలను అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు.ఈ పరీక్షలు 15వ తేదీన ఉదయము,మధ్యాహ్నం నిర్వహించడం జరుగు తుందన్నారు.ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండవి పరీక్ష నిర్వహిం చడం జరుగుతుందన్నారు.వనపర్తి జిల్లాలో ఉదయం 7186 మంది విద్యార్థులు,మధ్యాహ్నం 5547 మంది పరీక్షలు రాయనున్నారు.ఈ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఉదయం 30 సెంటర్లు, మధ్యాహ్నం కొరకు 25 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ నెల 15వ తేదిన నిర్వహించే పరీక్షలో హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ప్రారంభం కావడానికి ముందే పరీక్ష కేంద్రంలో ఉండాలని సూచించారు . ఉదయం 8.45 గంటల తరవాత ఎవరు వచ్చిన అనుమతించమని,అదేవిధంగా మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.15 వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు.విద్యార్థులకు గేటు దగ్గర పకడ్బందీగా చెకింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల భద్రత కోసం పోలీసు శాఖ బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలన్ని,జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలరి సూచిం చారు.పరీక్షల పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు.వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఆర్టీసీ అధికారులు పరీక్షా సమయాలను అనుసరించి ఆర్టీసీ బస్సులను సజావుగా నడపాలన్నారు.పరీక్షలు సజావుగా నిర్వ హించే విధంగా ఇన్విజిలేటర్లకు,ఇతర సిబ్బందికి శిక్షణ బాగా ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ యస్.తిరుపతి రావు,జిల్లా విద్యా శాఖాధికారి నరహరి, గోవిందరాజులు, డి.ఎస్పీఆనంద్ రెడ్డి ,ఆర్.టి.ఒ రామేశ్వర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి,కలెక్టరేట్ పర్య వేక్షకుడు రమేష్ రెడ్డి,ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి మధుకర్,ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ తరపున సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో చేసిందేమి లేదు

◆ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ◆ మంత్రి సమక్షంలో పలువురు బిఆర్ఎస్‌లో చేరిక



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏళ్ల పాలనలో చేసిందేమి లేదని, పేదవాడి బతుకులు ఇంకా పేదవాడిగానే ఉండేవని, ఎక్కడ చూసినా తాగడానికి కూడా గుక్కెడు మంచినీళ్లు దొరికేవి కావని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆరోజు వలసలు పోయేవాళ్లమని, కానీ ఇప్పుడు పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా కళ్లకు ఆహ్లాదకరంగా పచ్చని పంటలు కనిపిస్తున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన పలువురు, అలాగే జల్లాఘనపూర్ మండలం నుండి బిజెపి, కాంగ్రెస్, బీఎస్పీల నుండి రాష్ట్ర ఆయిల్‌పామ్ సాగు సలహాదారులు, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో పార్టీలో 30 మంది బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేడు జిల్లాలోని రైతు కళ్లలో ఆనందం కనిపిస్తుందని, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తుండడంతో ఆయనతో కలిసి పని చేయడానికి పార్టీలోకి రావడం జరిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం వార్డు మెంబర్ కేశపాగా చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ ముంత మద్దిలేటి, గంగాధర్, హరిప్రసాద్ గౌడ్, గుంటి శివ, ఈశ్వర్ నాయుడు, ముంద సురేందర్, శివసాగర్, వెంకటేశ్ సాగర్, వార్డు మెంబర్ సంపత్ నాయుడు, గుంటి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే రూ. 4016 పింఛన్

● దివ్యాంగులకు అన్ని విధాల అండగా తెలంగాణ ప్రభుత్వం
● పర్మినెంట్ డిజేబుల్ సర్టిఫికెట్ అందించేందుకు కృషి చేస్తాం
● దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు8 ప్రభాతవార్త:** దేశంలో దివ్యాంగులకు రూ. 4016 పింఛన్ అందిస్తున్నది కేవలం తెలంగాణలో మాత్రమేనని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించి వారికి అండగా నిలుస్తున్నదని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో ఉన్న ఆర్వీఎం మీటింగ్ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా అలీమ్ కో వారి ఆధ్వర్యంలో 425 మంది దివ్యాగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు సమైక్య రాష్ట్రంలో కనీసం తాగడానికి నీళ్లు కూడా ఉండేవి కాదని తెలంగాణ ఏర్పడిన తర్వాత పాఠశాలలో సకల సౌకర్యాలను కల్పించా మని తెలిపారు. విద్యార్థుల దీవెనలు ఈ ప్రభుత్వానికి కావాలన్నారు. దివ్యాంగుల కోసం సదరం క్యాంపులు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం కెసిఆర్ దృష్టికి తీసుకుపోయి దివ్యాంగులకు పర్మినెంట్ డిజేబుల్ సర్టిఫికెట్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. పిల్లలు దైవంతో సమానమని వారి వైకల్యం బాధను కలిగించినా వారిని దేవుడిచ్చిన వరంగానే తల్లిదండ్రులు భావించాలన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు ఎప్పటికైనా వారు వైకల్యాన్ని జయిస్తారనే మనోధైర్యాన్ని కలిగి, పిల్లలకు అంగా ఉన్నప్పుడే మంచి ఫలితాలను సాధించగలుగుతారని అన్నారు. ఆ దిశగా మనోధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటూ వారికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో అలీమ్ కో ద్వారా క్రచర్స్ 14, రొలేటర్లు 29, ట్రైవీలర్, సైకిళ్లు 4 వీల్ చైర్లు 69, ఆర్టిఫిషియల్ లింబ్స్ 52, వినికిడి పరికరాలు 148, యంఎస్ఐడి కిట్లు 107, బ్రెయిలీ కిట్లు 2 మొత్తం 425 ఉపకరణాలను మంత్రి పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా విద్యాధికారి రవిందర్, సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ మంజులాదేవి, కౌన్సలర్లు కిశోర్‌కుమార్, రామ్‌లక్ష్మణ్, తిరుమల వెంకటేష్, సంధ్య శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# పారదర్శకంగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ



ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపడుతున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతల ప్రక్రియ కొనసాగుతుందని, శుక్రవారం సాయంత్రానికి దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల స్థానాలను ఖాళీల జాబితాలో ప్రకటించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 2008 మంది ఉపాధ్యాయులు బదిలీలకు ధరఖాస్తులు చేస్తున్నారని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి అక్టోబర్ 3 లోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేసే విధంగా షెడ్యూల్ వచ్చిందన్నారు. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు గడువు ఇచ్చారని, 3 రోజుల పాటు ఆన్‌లైన్ చేసుకున్న ఉపాధ్యాయుల బదిలీల ధరఖాస్తు హార్డ్ కాపీలను పరిశీలించి జాబితా రూపొందించారు. శుక్రవారం ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సినియార్టీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నట్లు ఆయన తెలిపారు. గెజిటెడ్ హెచ్‌ఎంలకు సంబంధించిన జాబితాను ఆర్‌జేడీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అందరు ఉపాధ్యాయులు చూసుకునేలా డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. 10,11 తేదీల్లో జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 12న ఫైనల్ జాబితా అందుబాటులో ఉంచుతామన్నారు. మూడేళ్లలోపు సర్వీస్ ఉన్న వారు బదిలీ తప్పనిసరిగా కోరుకుంటే తప్ప బదిలీ అవుతారు. లేకుంటే వారికి మినాహాయింపు నిచ్చిందన్నారు. ప్రస్తుతం దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాత్రం తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా, సీనియార్టీ జాబితా తయారు చేసిన నేటి సాయంత్రం వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే తెలిపేందుకు అవకాశమిస్తామని, ఆ తర్వాత సీనియార్టీ జాబితా తయారు చేసి పారదర్శకంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తామని డీఈఓ గోవిందరాజులు తెలిపారు.

# అభ్యంతరాలను వేగంగా పరిష్కరించాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్



**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన అభ్యంతరాలన్నింటిని వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్ ఆదేశించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కారం విషయమై శుక్రవారం ఆయన ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫారం 6కు సంబంధించి మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పరిష్కారం బాగాఉందని అలాగే జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి ఫారాల పరిష్కారం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫారం 7పై అందరు ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ముఖ్యంగా జాబితాలో డబుల్ పేర్లు, చనిపోయిన వారి పేర్లకు సంబంధించి ఫారాలను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని, ఇదివరకే ఆదేశించినట్లుగా పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లతో మరణ ధృవీకరణ పత్రం తీసుకుని వాటి ఆధారంగానే చేయాలని ఆదేశించారు. అలాగే ఫారం 8 పరిష్కారం రాష్ట్ర సరాసరికి తగ్గకుండా చూసుకోవాలని, రాబోయే మూడు రోజుల పాటు వీటన్నింటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇవన్ని ఈ రోల్‌లో వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ విషయమై సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్న దృష్ట్యా శుక్రవారం సాయంత్రంలోగా ఓటరు జాబితా సవరణకు సంబంధించి అన్ని వివరాలను సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా 15 జులై నుండి ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులు పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి, పోలింగ్ కేంద్రం, మండలాల వారిగా, నియోజకవర్గం వారిగా సమర్పించాలని ఆదేశించారు. ఓటరుజాబితా సవరణలో భాగంగా ఓటరు నమోదు, సవరణపై నిర్వహించిన ప్రత్యేక ప్రచార దినోత్సవాల సందర్భంగా వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై సైతం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, జెండర్ రేషియో, 18,19 సంవత్సరాల మధ్య వయసున్నవారు ఓటరుగా నమోదు శాతాన్ని పెంచాలని చెప్పారు. అలాగే గిరిజన, చెంచు ఓటర్ల నమోదు, 80 సంవత్సరాల పైగా ఉన్న వారి ఓటు వివరాలు, దివ్యాంగులు, థర్డ్ జెండర్, సెక్స్ వర్కర్ల ఓటరు నమోదుపై దృష్టి సారించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఏఈఆర్ఓలుతనిఖీ చేయాలని, ఓటరు గుర్తింపు కార్డుల ప్రింటింగ్‌పై దృష్టి సారించాలని, పట్టణ ప్రాంతాలలో ఓటరు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.జడ్చర్ల ఈఆర్ఓ,రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, మహబూబ్‌గర్ ఈఆర్ఓ,ఆర్డీఓఅనిల్‌కుమార్, దేవరకద్ర ఈఆర్ఓతో పాటు, ఏఈఆర్ఓలు, జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ ఈ టెలికాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# విధి నిర్వహణలో నిజాయితీ ముఖ్యం

డిఐజి ఎల్‌ఎస్ చౌహాన్

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో నీతి నిజాయతీ చాలా ముఖ్యమని జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. కొత్తగా శిక్షణకు వెళ్తున్న 26 మంది ఎస్సైలు (సివిల్)లకు ఐడి కార్డులు మంజూరు చేశారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమిలో ప్రారంభంకానున్న ఎస్సీటి ఎస్సైలు(సివిల్) (స్టైఫెడైరీ క్యాడెట్ ట్రైనీ సబ్ ఇన్స్పెక్టర్) శిక్షణకు సర్వం సిద్ధం చేసి రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ డిఐజి మాట్లాడుతూ పోలీస్ జాబ్ సాధించగానే చాలామంది గర్వంగా ఫీలవుతూ విధులు నిర్వహిస్తుంటారని కానీ ప్రస్తుత సమాజంలో పోలీసు విధులు నిర్వహించే సమయం సమాజం మనల్ని గమనిస్తుందని తెలుసుకుని విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా మన ప్రవర్తన,డిస్‌ప్లేన్, చురుకుతనం, అనుకువగా ఉండడం చాకచక్యం చలా ముఖ్యమన్నారు.అందరికి లీడర్‌షిప్ క్వాలిటీస్ కూడా ఉండాలన్నారు. ఈ ఉద్యోగాలకు రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులు పోటీ పడితే వందల మంది మాత్రమే ఎంపికయ్యారని అందులో శారీరక శ్రమ, కఠోరదీక్ష ఎంతో ఉంది కాబట్టి అది తెలుసుకుని జాగ్రత్తగా శిక్షణ పూర్తిచేసుకుని రాగలరని కోరారు.

# పేద ప్రజల బాంధవుడు సీఎం కేసీఆర్

**- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**



పాదయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి పేద ప్రజల బాంధవుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారని, తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల రైతుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 9వ రోజు పాదయాత్రలో భాగంగా తాడూర్ మండలంలోని గుంతకోడూరు, యాదిరెడ్డిపల్లి, తాడూర్ గ్రామాల్లో 11 కిలో మీటర్ల మేర పాదయాత్ర నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభివృద్ధికి ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేశారని, 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతు భీమా, కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ ఆసరా పెన్షన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి, కేసీఆర్ కిట్ లాంటి ఎన్నోసంక్షేమాలనుఅందించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో రైతులకు చేయనటు వంటి అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రం అందించిందన్నారు. రైతుల అభివృద్ధి కోసంనూతన వ్యవసాయ పద్దతుల పంటల మార్పిడి కోసం రూ.5వేల జనాభాకు రూ.30లక్షల వ్యయంతో రైతు వేది కలను ఏర్పాటు చేశారని,రైతులను పేద ప్రజలను మరింత అభి వృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందుసుక్తొస్తుందన్నారు.పాదయాత్ర లో భాగంగా గ్రామాలకు విచ్చేసిన మర్రికి మహిళలు బోనాలతో స్వాగతం పలికారు.పాదయాత్రలో డీసీసీబీ డరెక్టర్ జక్కారఘునందన్‌రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి భైకాని శ్రీనివాస్ యాదవ్, గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



పాదయాత్రలో మహిళలు బతుకమ్మ ఆడుతున్న దృశ్యం



# మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, సెప్టెంబరు8 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీలో ఈనెల 13వ తేదీన ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు పలు అభివృద్ధి,భూమిపూజల కార్యక్రమాల స్థలాలను శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ మున్సిపాల్టీ ప్రాంతాలలో పర్యటించారు. ఈనెల 13వ తేదీన నారాయణపేట జిల్లా మక్తల్‌కు ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన చేసే స్థలాలు పరిశీలించారు. మున్సిపాల్టీలోని సర్వే నంబర్ 919ల 150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన, ఉట్కూర్, నర్వ మండలాలకు సంబంధించిన కెజిబివి పాఠశాల ప్రారంభోత్సవం, మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు కట్ట వెల్కమ్ బోర్డు ప్రారంభోత్సవం, మున్సిపాలిటీ పరిధిలోని చందాపురం రోడ్డులో 943 సర్వే నంబర్లలో ఫైర్ స్టేషన్‌కు భూమిపూజలు చేస్తాని తెలిపారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని అందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలనిఅన్నారు.అనంతరం తహసిల్దాదర్ కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా. రంజిత్, డా. చక్రధర్‌గౌడ్, తహసిల్దార్ పుష్పరాజ్, అగ్నిమాపక డీఎస్పీ సిఐ , ఎస్సై పలు విభాగాల ఇంజనీరింగ్ అధికారులు స్థానిక సిఐ రాంలాల్, ఎస్సై పర్వతాలు,మున్సిపల్ కమిషనర్,ప్రజా ప్రతినిధులు,మైపాల్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామలింగం, ఆత్మకూర్ తెరాస అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# ఓటరు నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

● గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో గద్వాల మండలం బిఎల్ఓలు, సూపర్‌వైజర్లతో అవగాహన, ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. మండల కేంద్రాలలో ఎంతమంది కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఫారం6 ద్వారా ఓటరుగా నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే పారం 7,8 ద్వారావాటిని మార్చాలన్నారు. ఎవరైనా ఓటరు మరణిస్తే వారి డెత్ సర్టిఫికెట్ తీసుకుని జాబితా నుండి వారి పేర్లను డిలీట్ చేయాలన్నారు. మండలంలో ఎంత మంది ఓటరు నమోదు అయ్యారో ఎంత మందిని తొలగించారో పూర్తిస్థాయిలో నివేదిక ఏరోజుకారోజు పంపాలన్నారు. ఓటరు కార్డు ఉండి జాబితాలో పేరు లేని వారు, మరణించిన వారి పేరు తొలగింపు, చిరునామా మార్పు, అలాగే అక్టోబర్ 1,2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ చంద్రకళ, తహసిల్దార్ నరెందర్, డిప్యూటి తహసిల్దార్ విజయ్, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన యువకులు



**ఖిల్లాఘనపూర్, సెప్టెంబర్08, ప్రభాతవార్త:** ఖిల్లాఘనాపురం మహ్మదుస్సేన్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ బిజెపి పార్టీల యూవకులు శుక్రవారం రాష్ట్ర ఆయిల్ ఫామ్ సభ్యులు లక్ష్మ రెడ్డి బి ఆర్ ఎస్ నాయకులు చిన్న రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి మంత్రి సముదయంలో 30 మంది యూవకులకు మంత్రి నిరంజన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ప్రతి అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రజల నుండి సంపూర్ణ మద్దతు ఉంది రాబోవు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మల్లి కేసిఆర్ ప్రభుత్వంవస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర అయిల్ ఫామ్ సభ్యులు లక్ష్మరెడ్డి చెన్న రెడ్డి మహేష్ రాజు శివ వెంకటేష్ యాదయ్య ఎస్ సురేష్ బాబు పల్లె చెన్నయ్య శ్రీను బుచ్చన్న వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్8, ప్రభాతవార్త:** మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు గంధం గోవిందమ్మ (27) అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామ బీఆర్ఎస్ నాయకులు వనపర్తి నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పదివేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులుమృతదేహాన్ని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.

## బడి బయట పిల్లల సర్వే నిర్వహించిన ఎంవిఎఫ్ ఫౌండేషన్ సంస్థ



బడి బయట పిల్లల సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

**కెటిదొడ్డి, సెప్టెంబరు 08 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎంవిఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల కార్మికులు, బడి బయట పిల్లల సర్వే జరుగుతుందని సర్వేలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 9 అనుబంధ గ్రామాలలో సర్వే చేశారు. ఈ సర్వేలో పిల్లలు చాలామంది బడికి దూరమై పొలాల్లో సీడ్‌పత్తి క్రాసింగ్ పని కొరకు పిల్లలను వేరేచోట జీతాలు పెట్టడం, ఇంటి యజమానులు పొలాల్లో పనుల కోసం వెళ్లే సమయంలో ఇంటిదగ్గర ఉన్న పిల్లలను చూసుకోవడం, ఇటుక పనులకు వెళ్లటం వంటి పనులలో పిల్లలు ఉన్నారని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ సర్వేను 25 మంది ఎంవిఎఫ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవిఎఫ్ ఫౌండేషన్ సంస్థ నుండి కిరణ్, మల్దకల్, జయరామ్, పల్లవి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో గొర్రెల దాణ పంపిణీ



**దేవరకద్ర, సెప్టెంబరు08 ప్రభాతవార్త:** దేవరకద్రలో శుక్రవారం గొర్రెల దాణను పంపిణీ చేశారు. దాదాపు 36 యూనిట్లకు ఈ గొర్రెలదాణను పశువైధ్యశాల వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్‌మండల అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి, మార్కెట్ చైర్మెన్ ఉమ్మిగారి విజయవెంకటేశ్, పశోవైధ్యాధికారి జీషాన్‌అలీ, యాదవ సంఘం అధ్యక్షుడు కెవి.రాజు, మాజీ యంపీటీసీ ఉస్కిల్ల వెంకట్రా ములు, నాయకులురాము, అంజి, యంపీఓ, పశువైధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశావర్కర్లకు కిట్ల అందజేత



ఆశకార్యకర్తలకు కిట్లు అందజేస్తున్న డాక్టర్ సంధ్యాకిరణ్మయి

**భూత్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** అసంక్రమిత సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత చాలా అవసరమని, ఇందుకోసం ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పనిచేయాలని అంక్రమిత వ్యాధుల నివారణ అధికారిణి డాక్టర్ సంధ్యాకిరణ్మయి పేర్కొన్నారు. శుక్రవారం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆశవర్కర్లు, ఆరోగ్యకార్యకర్తలతో అసంక్రమిత వ్యాధులపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యాకిరణ్మయి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా ఆశవర్కర్లు అన్ని జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశకార్యకర్తలకు హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి కిట్లను అందజేశారు. కిట్లు ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలకు చాలా ఉపయోగపడుతాయని, చిన్న పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంఒ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, సూపర్‌వైజర్లు యాదమ్మ, సుధాకర్, హెల్త్ అసిస్టెంట్స్ ప్రమోద్‌తో పాటు ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

**భూత్పూర్, సెప్టెంబర్8, ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం భూత్పూర్ మండలం కరివెన గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన శివ, రాజు, మహేష్, ఖజా, నాయక్, గౌస్, పాషా, మోహన్‌తో పాటు 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబి కండువా కప్పి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకులు టి మురళిధర్ గౌడ్, మాజీ ఎంపిపి రాచూరి చంద్రమౌళి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బహుజనవాదాన్ని బలపరుస్తుందుకు ఘన సన్మానం



బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, అమరవాయి కృష్ణారెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డికి అమరవాయి కృష్ణారెడ్డికి బహుజనవాదాన్ని బలపరుస్తుందుకు ఘనంగా సన్మానం చేశారు. గద్వాల నియోజకవర్గంలో 1952 నుండి 2018 వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో నుంచి 9సార్లు కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా అగ్రవర్ణాల నాయకులు గెలిచారు. మన బిసి నాయకులు 9సార్లు కాంగ్రెస్ పార్టీ నుండి ఒక్కసారైనా ఎమ్మెల్యేగా గెలిచారా లేదు. 1999 ఒక్కసారి మన బిసి నాయకుడు గట్టు భీముడు తెలుగుదేశం పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలువడం జరిగింది. అదికూడా నాలుగు సంవత్సరాలు మాత్రమే కొనసాగడం జరిగింది. దీనిని బట్టి ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలు ఏం అర్థం చేసుకున్నారు. నేటికి 16 సార్లు గద్వాల నియోజకవర్గానికి ఎన్నికలు జరిగితే మనం ఓట్లు మాత్రమే వేయాలి. 5శాతం ఉన్న బిసిలు వారు మాత్రం ఎప్పుడూ రాజ్యాధికారంలో ఉండాలి ఇదెక్కడి న్యాయం అన్నారు. జడ్పీ చైర్మన్‌మాట్లాడుతూ రాష్ట్రఏర్పడిన తరువాత మనగద్వాలను జోగులాంబ గద్వాల జిల్లా అయిన తరువాత మొట్టమొదటి చైర్ పర్సన్‌గా సరిత తిరుపతయ్యను ఎన్నుకోవడం జరిగింది. కానీ పేరుకు మాత్రమే జడ్పీ పదవిలో నేనుఉన్నాను కానీపెత్తనం అంత అగ్రవర్ణాలదే నడుస్తుంది. జడ్పీ చైర్‌పర్సన్ పదవి బిసిలకు వచ్చిందని అగ్రవర్ణాల నాయకులు ఓర్వలేక జడ్పీ సమావేశంలో ప్రతి విషయంలో అడ్డు పడే వారుఇలాంటి సమయంలో నాకు ఒక ఆలోచన వచ్చింది. జడ్పీ పదవిపై రెడ్ల పెత్తనంఏంటని బిఆర్ఎస్ రూలింగ్ పార్టీకి రాజీనామా చేసి ఆత్మగౌరవం కోసం 500ల మందితో గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. సన్మాన కార్యక్రమంలో ఎంపి నందు, అల్లిపూర్ మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, ఉప్పేరు సురేష్, మల్దకల్ రాజారత్నం పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ వెంకటేష్

**అలంపూర్, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** అలంపూర్ పట్టణంలోని కుర్వ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ వెంకటేష్ పూజా కార్యక్రమంలో పాల్గొని కృష్ణాష్టమి వేడుకలను నిర్వాహకులు వెంకటేష్ యాదవ్, (బుజ్జి యాదవ్) మల్లికార్జున్, వీరేష్, వెంకటేష్‌తో కలిసి ప్రారంభించి వేడుకలను తిలకించారు. అనంతరం ఈ వేడుకలలో విజేతగా నిలిచిన దొడ్డిపాడు అశోక్‌కు వెండి పతకాన్ని (ఐదున్నర తులాలు న్యాయవాది నాగరాజ్ యాదవ్ దాత) ఛైర్‌పర్సన్ మనోరమ వెంకటేష్ చేతులమీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మనోరమ వెంకటేష్ మాట్లాడుతూ మన అలంపూర్ పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు కుర్వ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఇంత ఘనంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. అందుకు కారకులైన కమిటి సభ్యులందరిని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇందుకు క్రియాశీల పాత్ర పోషించిన బుజ్జి యాదవ్‌ని గంగరాజుయాదవ్‌కి, పిండి జయరాముడుకి, నాగరాజు యాదవ్‌కు, సంఘ పెద్దలందరికి అభినందనలు తెలిపారు. శ్రీకృష్ణుని దయవలన అలంపూర్ పట్టణ ప్రజలందరు సుఖసంతోషాలతో క్షేమంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కుర్వ యాదవ సంఘం కృష్ణాష్టమి, పట్టణ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# మట్టి సేకరించిన బీజేపీ నేతలు



ఇంటింటికి వెళ్లి మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తి క్రైం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నా భూమి నాదేశం కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు బుచ్చు రాము శుక్రవారం వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, ఇందిరా కాలనీ, గాంధీ నగర్ కాలనీలలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కృష్ణ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన నాభూమి నాదేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే ఇంటింటికి తిరుగుతూ చిటికెడు మట్టిని సేకరించే కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగేందుకు కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలను అభినందించారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు ఇంటింటా సేకరించిన మట్టిని ఢిల్లీలోని అమృత్‌వనంకు చేర్చి ప్రధాని నరేంద్ర మోదీ ద్వారా మొక్కలు నాటుతారన్నారు. దేశ రక్షణలో ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగం వల్ల దేశం సుభిక్షంగా ఉందని తెలిపారు. అమరవీరుల త్యాగాలు భావితరాలకు గుర్తుండే విధంగా కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు సీతారాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అనుజ్ఞ రెడ్డి, నాయకులు కుమార్, బాబురావు, సుబ్రహ్మణ్యం, రాయన్న సాగర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**భూత్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** అమరవీరుల సంస్మరణార్థం దేశ రాజధాని డిల్లీలో బీజేపీ నిర్మించ తలపెట్టి అమృతవాటికకు దేశనలు మూలల దేవాలయాల వద్ద మట్టిని సేకరి స్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం భూత్పూర్ మండలం అన్నాసాగర్, తాటికొండలలో ఉన్న దేవాలయాల వద్ద మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీం దర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాపురం రవీందర్, రూరల్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యాదర్శి గొడుగు అంజనేయులుతో పాటు నాయకులు లిక్కి హరినాథ్‌గౌడ్, మల్లిఖర్జున్, పట్నం శ్రీశైలం, కరెంట్ నర్సింహులు, నవీన్‌కుమార్, శివరాజ్, శివరాములు పాల్గొన్నారు.

# గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే అల



మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ భూత్పూర్‌లో అత్యాధునికంగా నిర్మించిన నూతన గృహప్రవేశ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు దేవరకద్ర ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు, శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆలతో పాటు ఆయన సోదరుడు ఆల శివర్ధన్‌రెడ్డి, భూత్పూర్ ఎంపిపి చైర్మన్ కదిరే శేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, జిల్లా మత్స్యసహకార సంఘం చైర్మన్ మనెమోని సత్యనారాయణ, మండల రైతు బంధు అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, ముడా డైరెక్టర్లు సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మూస సాయి లుతో పాటు పార్టీ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, సత్తూర్ అశోక్ గౌడ్, మూస బాలస్వామి, శేఖర్‌గౌడ్, బోరింగ్ నర్సింహులు, రాచూరి చంద్రమౌళి, గడ్డం రాములు, గడ్డం యాదయ్య, గడ్డం ప్రేమ్‌కుమార్, వడ్ల బ్రహ్మయ్య, మేకల సత్యనారాయణ, రాముదాథోడ్, సత్తూర్ సురేష్‌గౌడ్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్, కరివెన బాల్‌రెడ్డి, సత్తూర్ సదానంద్‌గౌడ్, గడ్డం మునయ్య, గడ్డం శ్రీను, బజార్ శ్రీశై లం, జబార్ పరుశురాం, గడ్డం భీమా స్వామితో పాటు కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, బీజెపి నాయకులు రవీందర్‌రెడ్డి, ఫరూఖ్ హుస్సేన్, గోపాల్‌నాయక్, తాటిపర్తి సర్పంచి ఆకుల వెంకటయ్య, భట్టుపల్లి సర్పంచి అంజనేయులు నాయక్, బోల శేఖర్‌తో పాటు గిరిజన నాయకులు దశరథ్‌నాయక్, తారు నాయక్, బీక్యానాయక్ పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

### - ఘనంగా శ్రావణమాస చివరి శుక్రవారం పూజలు



గోపన్‌పల్లిలో లక్ష్మీపూజ చేస్తున్న భక్తులు

**దేవరకద్ర, సెప్టెంబరు08 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆయా గ్రామాలలోని దేవాలయాలలో భక్తులు వివిధ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆయా గ్రామాలలోని దేవాలయాలలో ప్రతి శుక్ర, శని, సోమ వారాలలో ప్రత్యేకపూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగం గానే శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఈ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని దేవరకద్ర, చిన్నరాజమూర్, జీన్గరాల, డోకూర్, కౌకుంట్ల, పుట్టపల్లి, పెద్దరాజమూర్. గుడిబండలతో పాటు ఆయా గ్రామాలలోని దేవాలయాలలో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రసాదపంపిణీ కార్యక్రమాలను కూడ నిర్వహించారు. దీంతో ఆయా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాంప్రదాయరీతిలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**గోపన్‌పల్లిలో ఘనంగా లక్ష్మీదేవిపూజ:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవిపూజ కార్యక్రమాన్ని కన్నులపండువలా నిర్వహించారు. పూజారులు మఠం సురేష్‌స్వామి, సూగయ్యస్వామి అధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిని వివిద రకాల పూలతో, ఆభరణాలతో శోభాయమానంగా ముస్తాబుచేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదపంపిణి కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. సాంప్రదాయరీతిలో నిర్వహించిన ఈ పూజలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి మఠం సురేష్‌స్వామి కుటుంబసభ్యులులతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక దేవాలయాలలో కూడ శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ

### -అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



వాసవిమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**దేవరకద్ర, సెప్టెంబరు8 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలుతదితరపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వాసవి మాతఅమ్మవారుభక్తులకు అలంకరణలోభక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళ హారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాసన సభ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

### జిల్లా ఓబీసీ మోర్చ కార్యదర్శి బెన్నురు ఆశన్న




**ఖిల్లా ఘనాపురం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** ఖిల్లా ఘనాపురం మండల కేంద్రానికి చెందిన జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి బెన్నూరు ఆశన్న శుక్రవారం హైదరాబాద్ శ్యామ్ ముఖర్జి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వనపర్తి నియోజకర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి అని ధరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బెన్నూర్ ఆశన్న మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వివిధ రాష్ట్రాలలో సామాన్య సామాన్య కార్యకర్తలకు ఎమ్మెల్యే పోటీ చేస్తే అవకాశం కల్పించిందిఅని ఇలాంటి అవకాశం కల్పించినందుకు మోడీ, కేంద్ర నాయత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నాయి బ్రహ్మణ సామాజిక వర్గానికి చెందిన నేనుకూడా గత 25 సంవత్సరాలుగా పార్టీకి వివిధ రకాల బాధ్యతలలో సేవలు అందించడం జరిగింది. అనివార్య వర్గాలకు చెందిన సామాన్య కార్యకర్తనుగుర్తించి, నాకుఅవకాశం కల్పిస్తే వనపర్తి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను కాబట్టి నాకు పార్టీ అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానంలో ఆర్.రాజేందర్ కుమార్



వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన గవర్నర్

**వనపర్తి క్రైం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** గత ఆగస్ట్ మాసంలో రాజ్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర వ్యాస రచన పోటీలలో వనపర్తి జిల్లాకు చెందిన రెడ్ క్రాస్ సమన్వయకర్త ఆర్.రాజేందర్ కుమార్ ద్వితీయ బహుమతిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరాజన్ చేతుల మీద అవార్డు, రూ.ఐదు వేల నగదు బహుమతిని అందుకున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఖాజకుత్బుద్దీన్ తెలిపారు. సామాజిక, ఆర్థిక, అసమానతలను రూపుమాపడంలో నూతన విద్యావిధానం 2020 యొక్క ప్రాముఖ్యత వ్యాస రచన పోటీలలో అవార్డ్ నగదు బహుమతి అందుకోవడం వనపర్తి జిల్లా రెడ్ క్రాస్ కు గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా రెడ్ క్రాస్ పాలవర్గ సభ్యులు, పలువురు ప్రముఖులు ఆర్.రాజేందర్ కుమార్ ను అభినందించారు.

## ఉత్తమ ఉపాధ్యారాలుకి ఘన సన్మానం



**ఖిల్లాఘనాపురం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** ఖిల్లా ఘనాపురం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యారాలుగా పని చేస్తున్న శోభా రానికి ఉపాధ్యాయ దినోత్సవం సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిస్తాత్మకంగా చెప్పటిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల సమావేశంలో శోభరానికి ఉత్తమ అవార్డు విద్య శాఖ మంత్రి సబిత ఇంద్ర రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యారులుగా అవార్డు, ప్రశంస పత్రం రావడం పట్ల స్థానిక సర్పంచ్ వెంకటరమణ సంతోషం వేక్తం చేసి శుక్రవారం ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో ఉత్తమ ఉపాధ్యాయురాలు శోభారాని గ్రామ ప్రజలందరి తరపున ఘనంగా శాలువతో సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలుపడం రాబోవు రోజుల్లో విద్య పట్ల విద్యార్థులకు మంచి బోధనలు చేసి మరిన్ని ప్రసంసాలు అందుకోవాలని గ్రామ ప్రజల తరుపున ఆశిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్ మాజీ ఎంపిటీసీ బెస్త గోపాల్ చిన్న ఆంజనేయులుగౌడ్ షాపూర్ సర్పంచ్ బాల ఆంజనేయులు దీర్ఘయివు బుచ్చిబాబు శరత్ శేఖర్ అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబివిపి నాయకులను అరెస్టు చేయాలి

### ఎస్ఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



**పీపనగండ్ల, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకుల పై ఏబీవీపీ గుండాల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. వారు మాట్లాడుతూ, ఈ నెల 8,9,10వ తేదీలలో సంగారెడ్డి జిల్లాలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరగకుండా ఏబీవీపీ గుండాల్లాగా ఏబీవీపీ నాయకులు భౌతిక దాడులు చేశారని ఈ దాడులకు కారకులైన వారిని వెంటనే గుర్తించి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఏబీవీపీ నాయకులు హెచ్చరిస్తూ విద్యార్థుల సమస్యల పైన పోరాటం చేయడానికి మాతో పోటీ పడండి విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికై అధికారులతో విధ్యార్థుల సమస్యలను చర్చించి వారికి న్యాయం చేసేటట్టుగా పోరాటం చేయాలి కానీ, చదువు చదువు కై పోరాడులనే నినాదంతో విద్యార్థుల సమస్యల పైన నిరంతరం పోరాటం చేసే ఎస్ఎఫ్ఐ నాయకుల పైన దాడి చేయడం అనేది సిగ్గుచేటని ఏబీవీపీ నాయకులను ఉద్దేశించి వారు అన్నారు. సైద్ధాంతికంగా ఎదుర్కొనే దమ్ములేక దాడులుచేస్తున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నాయకుల పైన దాడులు చేసిన వారిని అరెస్టు చేయక పోతే న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారన్నారు.

## వికలాంగులకు పెంచిన పింఛన్ ధృవీకరణ పత్రాల అందజేత

**పీపనగండ్ల, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** పీపనగండ్ల మండల కేంద్రంలోని వికలాంగులకు పెంచిన పెన్షన్ యొక్క ధృవీకరణ పత్రాలు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్దన్ రెడ్డి చేతుల మీదుగా కొల్లాపూర్ ఎస్ఎం గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో కథలప్ప తెలియజేశారు. ధ్రువీకరణ పత్రాలు కలిగిన వికలాంగులు శనివారం ఉదయం ఎస్ఎం గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు రాగలరని ఎంపీడీవో పత్రిక ముఖంగా తెలియజేశారు.

## ఎల్‌ఓసీ చెక్కు అందజేత

**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన శివారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్య సేవలకోసంఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా మంజూరైన రూ.1.25లక్షల చెక్కును శుక్రవారం సిల్వర్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు చింతల వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లుబ్బంగిఆనంద్‌కుమార్, పసుల సుదర్శన రెడ్డిలు బాధితుడికి కల్వకుర్తి పట్టణంలో అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, కౌన్సిలర్ ఏజాస్, కొత్త గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు దామోదర్‌గౌడ్, రాకేష్‌శర్మ, రమకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



# పొగాకు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

### ◆గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** జిల్లాలో పొగాకు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పొగాకు, బీడీ, సిగరెట్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులై వచ్చే నష్టాలు కుటుంబంలో మన తల్లిదండ్రులు, మన కుటుంబీకులు పొందే దు:ఖం వివరిస్తూ చెడు అలవాట్లకు మొదటి నుంచి దూరంగా ఉండేలా విస్తృత ప్రచారం కల్పించిన కలెక్టర్ అన్నారు. పొగాకు వాడడం వలన కలిగే నష్టాలను పొగాకు వల్ల వచ్చే క్యాన్సర్‌ల గురించి అవగాహన కల్పించాలని, గుట్కా, బీడీ, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు చెడు అలవాట్ల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. బహిరంగ చెడు అలవాట్ల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. బహిరంగ స్థలాల్లో పొగ త్రాగరాదని, పొగాకు సంబంధించిన ఉత్పత్తులపై ప్రచారం నిషేధం అని, విద్యాలయాలకు దూరంలో పొగాకు సంబంధించినవి అమ్మరాదు,సేవించరాదని, స్కూల్‌కు దగ్గర ఉన్న కిరాణా షాపులను తనిఖీ చేయాలని అక్కడ సిగరెట్, పొగాకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు జిల్లాలో అవసరమైన ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలను పోలీస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని, మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం,యాక్ట్ గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, ఆర్డీఓ చంద్రకళ, ట్రాన్స్‌పోర్టు అధికారి పురుషోత్తంరెడ్డి, డిప్యూటి వైద్యారోగ్య అధికారి డా. సిద్ధప్ప, రామస్వామి, సిబ్బంది,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

## లయన్స్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి సేవలు అభినందనీయం


లయన్స్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** లయన్స్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి వైద్యులుగా ఆయన చేసిన సేవలు అభినందనీయమని, ఆయన నేటి డాక్టర్లకు ఆదర్శప్రాయుడని సిల్వర్ జూబ్లీక్లబ్ అధ్యక్షులు చింతల వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం లయన్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలతో కలిసి సిల్వర్ జూబ్లీక్లబ్ అధ్యక్షులు చింతల వెంకటరమణారెడ్డి పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో కొనసాగుతూ ఎంతో మందికి వైద్యం చేసి ప్రాణదాతగా నిలిచారని, లయన్స్‌క్లబ్‌లో సేవా కార్యక్రమాలుచేపట్టి ఎందరోమన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు షాన్‌వాజ్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంపత కుమార్, సురేందర్‌రెడ్డి,లింగారెడ్డి, ఉప్పు ఆంజనేయులు, మిర్యాల రాజయ్య తదితరులు ఉన్నారు.

## కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్, సీసీ కెమెరాల బహుకరణ


ఆర్బీఐ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రభుత్వ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ హైదరాబాద్ సౌజన్యంతో రూ.30వేలతో సీసీకెమెరాలు,కంప్యూటర్స్ బహుకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్బీఐ అధికారులు సీహెచ్ శివారెడ్డి, శ్రీఅరవింద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహవంతులైన విద్యార్థులతో కళకళలాడుతూ ఉండటంతో ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల అభ్యున్నతి కోసం ప్రిన్సిపల్, అధ్యాపకుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీ యుగంలో బ్యాంకుల పేరుతో సైబర్ మోసాలు ఏ విధంగా జరుగుతున్నాయి, వాటిని ఎలా ఎలా నివారించాలనే అంశంపై అరవింద్ విద్యార్థులకు వివరించారు. అనవసరంగా ఓటీపీ చెప్పొద్దు, లింక్ మేసేజ్‌లునమ్మొద్దన్నారు.విద్యార్థులు సెల్‌ఫోన్ పక్కన పెట్టి పుస్తకాలు చేతబట్టాలన్నారు. అనంతరం కళాశాలలోని 500 మంది విద్యార్థులకు పెన్నులు అందించారు.ఆర్బీఐఅధికారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వేణు, సదానందంగౌడ్, రమాకాంత్, నయీం, మల్లేష్, మల్లిఖార్జున్,రాజేష్, బాల్‌రాజు, శ్రీని వాస్, పరుశురాం,జుబేర్,లక్ష్మికాంత్,సంతోష్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీపై రాజకీయ పార్టీల వివక్షత ఎందుకు?


సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌గౌడ్

**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** 73 ఏళ్ల భారత రాజ్యాంగంలో చట్టసభల్లో ఇంత వరకు ప్రాతినిథ్యం లేని కులాలు కేవలం బీసీలే అని బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులునరేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ నెల 10న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించే బీసీల సింహగర్జనసభ ఏర్పాటు నిమిత్తమై కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నేళ్లు పాలకులు కేవలం బీసీలను ఓట్లు వేసే మర యంత్రాల మాదిరిగా చూశారని, తప్ప బీసీల సంక్షేమం, బీసీలకు రాజకీయ ఉనికి లేకుండా చేశారని, ఇక నుంచి అలా ఉండకూడదన్నారు. బీసీల్లో చైతన్యం తెచ్చే విధంగా 60శాతం ఉన్న బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 60 అసెంబ్లీ సీట్లను కేటాయించాలని వివిధ రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ నెల 10న నిర్వహించే సింహగర్జనకు లక్షలాదిగా బీసీ మేధావులు, విద్యార్థులు, బీసీ రాజకీయ ప్రముఖులు, యావత్తు, బీసీ సమాజం ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రమేష్‌బాబు, సురేష్‌గౌడ్, సాగర్, శివప్రసాద్, రవిగౌడ్, సతీష్ తదితరులు ఉన్నారు.

## సమగ్ర శిక్ష అభియాన్ గణాంకాధికారిగా మర్పల్లి మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు


సమగ్ర శిక్ష అభియాన్ గణాంకాధికారిగా మర్పల్లి మధుసూదన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అకౌంట్స్ అధికారిగా మర్పల్లి మధుసూదన్‌రెడ్డి శుక్ర వారం బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ గణాంకాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అకౌంట్స్ అధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా జిల్లాకు విడుదలైన నిధులను సక్రమంగా వినియోగించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ గణాంకాధికారిగా పనిచేసిన ఈశ్వరప్ప మహబూబ్‌నగర్ జిల్లా ట్రెజరీ కార్యాలయానికి ఇటీవలే బదిలీ అయ్యారు.

## కరివెన రిజర్వాయర్ ద్వారా మండలానికి సాగునీరు

### ●ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

**కోయిల్‌కొండ,సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** కరివెన రిజర్వాయర్ ద్వారా మండలానికి సాగునీరు తెచ్చి మండలంలోని ప్రతి చెరువును నింపి వ్యవసాయాన్ని ఓ పండగలా నిర్వహించేందుకు తనవంతు కృషి చేయడం జరుగుతుందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శేరి వెంకటాపూర్, లింగాల్‌చేడ్ గ్రామాలలో యాదవులకు గొర్రెలను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని రైతు వేదిక దగ్గర లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యేపంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా మండలానికి అతి త్వరలోనే సాగునీరు రావడం ఖాయమన్నారు. మండలానికి సాగునీరు అందించడమే తన జీవిత ఆశయం అన్నారు. కోయిల్‌కొండ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, నారాయణపేట బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్త ఎస్.రవిందర్‌రెడ్డి, ఎంపిపి శశికళ భీంరెడ్డి, జడ్పీటిసి విజయభాస్కర్‌రెడ్డి, కోయిల్‌కొండ సర్పంచ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. కృష్ణ,మండల సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయకర్త మల్లయ్య యాదవ్, ఖాజీపూర్ సర్పంచ్ కల్పన బచ్చిరెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షులు లక్కి లక్ష్మినారాయణగౌడ్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారీగా చేరికలు


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న దృశ్యం

**ధరూర్,సెప్టెంబరు 08ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధరూర్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన బిజెపి పార్టీ నాయకులు సల్వారెడ్డి, కుమ్మరి శివరాజు, కోరి రామన్న ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి నేడు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కెసిఆర్ నాయకత్వాన్ని బలపరచుటకు బిఆర్ఎస్ పార్టీలోకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వీరితోపాటు మినలబాయిని కృష్ణ, చాకలి ఆంజనేయులు, చాంద్ భాషా, బోయ మహానంది, పూజారి అంజి, కల్లిగేరి రంగన్న, శివరాజు, గురు ,మంగళ శ్రీనివాసులు వీరితో పాటు దాదాపు 50 మందికి పైగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కృష్ణయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, వెంకటన్నగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టాల అవగాహణతోనే ఉత్తమ భవిష్యత్


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ వాదుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య

**వనపర్తి క్రైం,సెప్టెంబర్08,ప్రభాతవార్త:** చట్టాల అవగాహణతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు,సఖి కేంద్రం న్యాయ సలహాదారుడు కృష్ణయ్య అన్నారు. తెలంగాణ మైనార్టీ బాలికల వసతి గృహంలో లోక్ అదాలత్ సంస్థ నేతృత్వంలో శుక్రవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే చట్టాల ఆవశ్యకతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.భారత రాజ్యాంగ చట్టాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని పేర్కొన్నారు.బోధనతో పాటు చట్టాలపై అవగాహన కల్పించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.పలు వర్గాల ప్రజలకు లోక్ అదాలత్ సంస్థ ఉచితంగా అందిస్తున్న న్యాయ సేవలను అందిపుచ్చుకోవాలని సూచించారు.లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు,పలు చట్టాల అంశాలతో కూడిన కరపత్రాలు విద్యార్థుల చేత ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సౌమ్య, అస్ర, విజిత,లోక్ అదాలత్ సంస్థ సిబ్బంది కృష్ణా రెడ్డి,శ్రీవర్ధన్ రావు, శేఖర్, నరేష్‌గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల చేత కరపత్రాల ఆవిష్కరణ

## ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపికలో పారదర్శకత పాటించాలి


మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ ప్రజా పంతా నాయకులు

**అమరచింత,సెప్టెంబర్ 08,ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు,గృహలక్ష్మి,బీసీ బంధు,మైనార్టీ సంక్షేమ పథకాల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా పారదర్శకత పాటించాలని సిపిఐ ఎంఎల్ ప్రజా పంత జిల్లా నాయకుడు,నందమల్ల ఎంపిటిసి హనుమంతు అధికారులను కోరారు.శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఏర్పాటు చేసిన సమావవేశంలో ఆయన మాట్లాడుతూ,దళిత బంధు పథకం హరులైన వారిని ఎంపిక చేయకుండా టిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు దళిత బంధు ఇస్తామని టిఆర్ఎస్ నాయకులు బాహాటంగా ప్రచారం చేసుకుంటున్నారని దళిత బంధు గ్రామాలలో గ్రామసభ నిర్వహించి హరులైన వారిని ఎంపిక చేయాలని వారు అధికారులను కోరారు.దళిత బంధు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాలని నిబంధన ఉన్న టిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎంపిక చేయడం అన్యాయమని,దళిత బంధు పథకానికి అర్హులైన దళిత పేదలకు ఇవ్వాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.గృహలక్ష్మి పథకం స్థలమున్నవారికి ఇవ్వాలని గృహలక్ష్మి పథకం ఇంటి నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బీసీ బంధు,మైనార్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హరులైన వారికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ ప్రజా పంత నాయకులు, రాజన్న,రాజు,సామేలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరాహార దీక్ష

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల 5 రోజుల రిలే నిరాహార దీక్షకు బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ గద్వాల నియోజకవర్గ అధ్యక్షులు బండారి ఎస్.రాజు,పట్టణఅధ్యక్షులు వాల్మీకి, బోయ మండ్లరవి, ఎస్ఎస్ఎ ఉద్యోగులు మద్దతు తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఎ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి భరోసా ఇవ్వాలని ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న డిమాండ్ నెరవేరాలంటే పాలకులు మారాలని అప్పుడే ఒక ఎస్ఎస్ఎ ఉద్యోగులే కాదు మిగతా అన్ని సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఉద్యోగ భద్రతతో బ్రతక కలుగుతారని అన్నారు. కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ సెక్రెటరీ సవరన్న, రేకులపల్లి గ్రామ ఉపాధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

## ఉత్సాహంగా కష్ణాష్టమి వేడుకలు


ఉట్లు కొడుతున్న శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు, యువకులు

**లింగాల,సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** శ్రీకృష్ణాష్టమి వేడుకలు లింగాల మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు పురవీధుల గుండా ర్యాలీగా రామాలయం వద్దకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు, యువకులు ఉట్లు కొట్టేందుకు పోటీపడుతూ కొట్టారు. కార్యక్రమంలో శ్రీరామ స్వచ్ఛంద కమిటి సభ్యులు, మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త : ఎఎస్సై పల్లయ్య

**నారాయణపేట ప్రతినిధి,సెప్టెంబరు08 ప్రభాతవార్త:** మక్తల్ కెజిబివి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పోలీసుల కళాబృందంచే కార్యక్రమాలను నిర్వహించారు.బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరా లు, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల ఏర్పడే అనర్థాలు, రోడ్డు భద్రతా, విద్యార్థినిలు మహిళలపై వేధింపులు, చదువుపై శ్రద్ధ, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎఎస్సై ఎల్లయ్య అన్నారు.విద్యార్థులు చిన్న కారణాలతో బడిమాని న తోటి విద్యార్థులు పనులకు వెళ్లిన బాల కార్మికులూ పని చేసిన పోలీసు లకు తెలపాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్, టీచర్లు,పోలీస్ కళా బృందం సురెందర్‌గౌడ్,శేఖర్, లింగన్న, కళ్యాణి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యారాలుకి ఘన సన్మానం



**మూసాపేట,సెప్టెంబరు08 ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన శోభారాణి కరుణాకర్‌గౌడ్ దంపతులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సన్మానించారు. తెలంగాణ రాష్ట్రస్థాయలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికై రాష్ట్ర మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీచే సన్మానం పొందిన మూసాపేట మండలం దాసరపల్లి గ్రామానికి చెందిన శోభారాణి కరుణాకర్‌గౌడ్ దంపతులను శుక్రవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు.సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ముందు ముందు మీరు ఇలాంటి అవార్డులు ఎన్నో పొంది గ్రామానికి మూసాపేట మండలానికి మంచిపేరు తీసుకురావాలని శోభరాణి కరుణాకర్‌గౌడ్ దంపతులను కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, దాసరిపల్లి సర్పంచ్ విజయభాస్కర్‌గౌడ్, వేముల సర్పంచ్ అరుణ రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన జిఎంఆర్



**మూసాపేట,సెప్టెంబరు08 ప్రభాతవార్త:** మూసాపేట మండలం సంకల్‌మద్ది గ్రామంలో మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆంజనేయులు మేనకోడలి వివాహానికి స్థానిక నాయకులతో కలిసి హాజరై జి. మధుసూదన్‌రెడ్డి నూతన వధూవరులను ఆశ్వీర్వదించారు. కార్యక్రమంలో మూసాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, గొల్ల రత్నయ్య, సుధాకర్, మన్యం, నాగరాజు పాల్గొన్నారు.

## హోంగార్డు రవీందర్ మృతికి రాష్ట్రం ప్రభుత్వం బాధ్యత వహించాలి


రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** గత మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన హోంగార్డు రవీందర్ శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో కల్వకుర్తి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో పాలమూరు చౌరస్తాలో రవీందర్ చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు దుర్గప్రసాద్ మాట్లాడుతూ రవీందర్ మృతికి సీఎంకేసీఆర్,ప్రభుత్వం బాధ్యత వహించి హోంమంత్రి మహబూబాబాద్ నుంచి తొలగించాలని, రవీందర్ మృతికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అన్ని వర్గాలకు సరైన న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, నరేష్‌గౌడ్,బాబీదేవ్, శ్రీధర్, విజయ్,రాంరెడ్డి,రాజేందర్‌రెడ్డి,శ్రీశైలం, సంపత్, శేర్‌రెడ్డి,శ్రీకాంత్, అంజి,లక్ష్మి నరసింహ, వంశీగౌడ్, కిశోర్ తదితరులు ఉన్నారు.

## ఆలయ భూములను కాపాడాలి


ఆలయ భూములు పరిశీలిస్తున్న అధికారులు

**అలంపూర్,సెప్టెంబరు08 ప్రభాతవార్త:** ఆలయ భూముల అన్యాక్రాంతం కావద్దని ప్రతి సెంటు భూమిని కాపాడాలని దేవాదాయ శాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు విజయ్,శ్రీనివాస్‌చారి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతోపాటు దేవస్థానం ఛైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈఓ పురెందర్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు సి. వెంకటేష్, వెంకటనారాయణరెడ్డి, నీలప్ప, అడివప్ప, ఆలయ ముఖ్య అర్చకులు ఎక్స్ అఫిషియో సభ్యులు డి. ఆనంద్‌శర్మలు, జిల్లా కల్లూరు శివారులోని ఆలయ భూములను పరిశీలించారు. అలాగే జి. సింగవరంలోని భూములనువారు పరిశీలించారు. కర్నూల్ జిల్లా నడిఒడ్డున గల కల్లూరు గ్రామ శివారులో ఉన్న ఆలయ భూములను విక్రయించేందుకు ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు అంగీకారం తెలుపలేదు. సదరు భూమిలో గోదాములు లేదా కళ్యాణ మండపాలకు ఇవ్వడం ద్వారా ఆలయాలకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

## మెడికల్ పీజి సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

**మల్దకల్,సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రానికి చెందిన కీ.శే॥ దామ గోవిందప్ప వంశానికి చెందిన కీ. శే దార గౌరయ్య మనవళ్లు దామమహేష్, దామ మోహన కృష్ణలు ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని ఉన్నత చదవులు పిజి కొరకు వెళ్తున్న సందర్భంగా మండల పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఘనంగా సన్మానం చేశారు. దామ మహేష్ చైనాలో ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని హౌస్ సర్జన్ ఉస్మానియా హైదాబాద్‌లో పూర్తి చేసుకున్నారు. అనంతరం పిజి ప్రవేశ కొరకు కర్ణాటలోని బీజాపూర్ మెడికల్ కళాశాలలో చేరుతున్నట్లు తెలిపారు. దామ మోహనకృష్ణ చిత్తూరు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని చిత్తూరు అపోలో ఆసుపత్రిలో హౌస్ సర్జన్ పూర్తయ్యాక పిజి కొరకు మహబూబ్‌నగర్ ఎస్‌విఎస్ ఆసుపత్రిలో పిజి కొరకు చేరుతున్నట్లు వారి తల్లిదండ్రులు దామ పద్మావతి చిన్న ఓబులేష్ తెలిపారు. కార్యక్రమంలో మల్దకల్ పద్మశాలి కుల సంఘం అధ్యక్షులు నీలి వెంకటన్న, దామ వెంకటేష్,క్యామ శివ, పద్మశాలి కుల బాంధవులు, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇక ఐటి పాలమూరు

- వలస జిల్లాకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు వస్తున్నాయి
- ఈనెల 16న పాలమూరుకు సీఎం కెసిఆర్
- ఎక్సైజ్‌శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** వలసల పాలమూరు నేడు ఐటి పాలమూరు అయ్యిందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి సమీపంలో ఉన్న ఐటి టవర్‌లో జువెన్ టెక్ ఇంక్, ఉపర్ టెక్ కంపెనీల కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లడుతూ పాలమూరు ఐటి పట్టణానికి మరో మణిహారమని 400 ఎకరాలలో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ ఐటి యువతకు బంగారు భవిష్యత్తు అని, వారి అభివృద్ధికి మంచి బాటలు వేస్తుందని తెలిపారు. ఇక్కడే ఇండియాలోనే అతిపెద్దదైన సెల్ కంపెనీని ఏర్పాటు చేయబోతున్నామని ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నీటిని విడుదల చేసిన అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా సస్య శ్యామలం కాబోతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఐటిశాఖ మంత్రి కెటిఆర్ సహకారంతో మూడు నెలల్లోనే ఐటి టవర్‌ను 400 ఎకరాల భూమిని సేకరించి ఎవరు ఊహించనంతగా భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని చెల్లించి ఇక్కడ యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ప్రారంభించిన ఐటి టవర్‌లోని రెండు కంపెనీల ద్వారా 11000ల మంది ఉద్యోగాలు పొందగా 11 వేల కుటుంబాలు ఇక్కడకు రానున్నాయని, భవిష్యత్తులో 30,40 వేల కుటుంబాలు ఇక్కడికి వస్తే ఈ ప్రాంతం రేపురేఖలు మారిపోతాయని ఇప్పటికే ఐదు లక్షల రూపాయలు ఉన్నఎకరా స్థలం మూడు, నాలుగు కోట్లకు పెరిగిందని, పాలమూరు రంగారెడ్డితో ఈ ప్రాంతం సస్యశ్యామలమైతే పారిశ్రామికంగా కూడా అభివృద్ధి సాధిస్తామని, స్థానికంగా భూములకు, ఆస్తులకు విలువలు పెరుగుతాయని అన్నారు. ఇకపై జిల్లాయువత బతుకుదెరువు కోసం వలస వెళ్లాల్సిన అవసరం లేదని, అందరికి ఉద్యోగాలు వచ్చేలా ఈ ప్రాంతంలోని చుట్టుపక్క వారందరికి ఉద్యోగాలువచ్చేలా శ్రమిస్తామనిమంత్రి తెలిపారు. మహబూబ్‌నగర్ ఐటిలో ఉద్యోగాలు పొందిన వారు బాగా ఎదగాలని, వచ్చిన ఉద్యోగంలో ముందుకు చేరి ఉన్నత స్థానాలకు వెళ్లాలని మంత్రి అన్నారు. జువెన్‌టెక్ అధినేత జిల్లాకు చెందినబిడ్డ ఉమాకాంత్, కంపెనీ ప్రతినిధి ప్రవీణ్ ముందుకు వచ్చి 100 మంది ఉద్యోగులతో తన కార్యకలాపాలను మహబూబ్‌నగర్ ఐటినుంచి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, జువెన్ టెక్ అధినేత ప్రవీణ్ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట ఉన్నారు.



ఐటి టవర్ వద్ద కంపెనీల ప్రతినిధులు ఉద్యోగులతో మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్



కంపెనీ కార్యకలాపాలు ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్

## ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ ఛైర్మన్



**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన గోళి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ఐటీశాఖ మాత్యులు కల్వకుంట్ల తారాకరామారావును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా గోళి శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో పనిచేసే వారికి సీఎం కేసీఆర్ సముచిత స్థానం అందిస్తారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## బీఎస్పీ ఉండవల్లి మండల మహిళా కన్వీనర్‌గా ఎస్. షాహిన్ ఎన్నిక



**అలంపూర్, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా బీఎస్పీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ప్రభుదాస్ ఆధ్వర్యంలో మహి ళ కన్వీనర్‌గా ఎస్. షాహిన్ ఎన్నకయ్యారు. జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షులు తిరుపాల్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ కుమారి మాయావతిని నాలుగుసార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత బీఎస్పీ పారీదన్నారు. మహిళలకు పెద్దపీట ఉంటుంది, రక్షణ ఉంటుంది. వారికి పురుషులతో పాటు 50 శాతం పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని అలంపూర్ నియోజకవర్గంలో ఉన్న మహిళలు పెద్ద ఎత్తున చేరి డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వాన్ని బలపరిచి అసెంబ్లీకి పంపించేలా కృషి చేయాలని కోరారు. ఎస్. షాహిన్ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు, గౌరవం లేదు, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు జరుగుతూ ఉన్నాయి. డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో నావంతు కృషి, మహిళల రక్షణ కోసం నేను కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ మహిళా కో కన్వీనర్ శోభరాణిగౌడ్, మానవపాడు మండల మహిళ కన్వీనర్ మల్లేశ్వరి, ఉండవల్లి మండల సెక్రెటరీ శివశంకర్‌గౌడ్, ఎర్రవల్లి మండల సెక్రెటరీ కొందేరు రవి, ఉండవల్లి శివ, తక్కశిల బూత్ అధ్యక్షులు మహేష్, మిన్నిపాడు బూత్ అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.

## కాటికాపరులకు ప్రభుత్వం పెన్షన్, బీమా సౌకర్యం అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

**ఇటిక్యాల, సెప్టెంబరు 08 ప్రభాతవార్త :** కులవృత్తిని నమ్ముకొని ఆధారపడిన కాటికాపరులకు తెలంగాణ ప్రభుత్వం పెన్షన్, జీవిత భీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని అలాగే అన్ని కులాల వారికి ఉపాధి, వివిధ పథకాలు అందిస్తున్నారని అలాగే తమకు కూడా ప్రభుత్వం అమలు చేసే ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం తహసిల్దార్ వెంకటేశ్వర్లుకు మాట బ్యాగరి కాటికాపరి స్మశాన వాటికల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, సభ్యుల ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో మాల బ్యాగరి కాటికాపరులకు 45 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం 60 సంవత్సరాల నుండి ఉన్న వారికిభీమా సౌకర్య కల్పించాలని కోరారు. అలాగే చేనేత కుటుంబాలమాదిరిగా మాకు కూడా ప్రత్యేక ఆరోగ్యశ్రీ కార్డు ఇవ్వాలని 3ఎకరాల పోడు భూములను ప్రభుత్వం పంపిణీ చేసి ఆదుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంజన్న, యుగంధర్, వెంకట్రాముడు, మద్దిలేటి, మధుబాబు, రంగస్వామి, రాజశేఖర్, రామకృష్ణ, ఉసన్న పాల్గొన్నారు.

## యువ మహిళా ఓటరు నమోదు



**ఇటిక్యాల, సెప్టెంబరు 08 ప్రభాతవార్త :** మండల పరిధిలోని 49 పోలింగ్ బూత్‌లలో శుక్రవారం 18 నుండి25 సంవత్సరాలు వయసు కలిగిన యువ మహిళలకు ఓటుహక్కు లేనిచో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం కొనసాగింది. అందులో భాగంగా కొండేరులో తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐల సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, వైద్యశాఖ సిబ్బంది అంగన్‌వాడి టీచర్‌ల ఆధ్వర్యంలో కొనసాగగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన యువ మహిళల నుండి తహసిల్దార్ వెంకటేశ్వర్లు దరఖాస్తులను స్వీకరించారు. అంతేకాక ఇటిక్యాల మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో ఎంపిడిఓ రాఘవ యువ మహిళల ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా మండల పరిధిలోని 49 పోలింగ్ బూత్‌లలో బిఎల్ఓలుగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడి టీచర్లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కొనసాగింది.

## మెడికల్ విద్యార్థికి ఘన సన్మానం

**మల్దకల్, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రానికి చెందిన కీ.శే॥ దామ గోవిందప్ప వంశానికి చెందిన కీ. శే దార గౌరయ్య మనవళ్లు దామమహేష్, దామ మోహన కృష్ణలు ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని ఉన్నత చదవులు పిజి కొరకు వెళ్తున్న సందర్భంగా మండల పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భక్త మార్కండే య స్వామి దేవాలయంలో ఘనంగా సన్మానం చేశారు. దామ మహేష్ చైనాలో ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని హౌస్ సర్జన్ ఉస్మానియా హైదా బాద్‌లో పూర్తి చేసుకున్నారు. అనంతరం పిజి ప్రవేశ కొరకు కర్ణాటలోని బీజాపూర్ మెడికల్ కళాశాలలో చేరుతున్నట్లు తెలిపారు. దామ మోహ నకృష్ణ చిత్తూరు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని చిత్తూరు అపోలో ఆసుపత్రిలో హౌస్ సర్జన్ పూర్తయ్యాక పిజి కొరకు మహబూబ్‌నగర్ ఎస్‌విఎస్ ఆసుపత్రిలో పిజి కొరకు చేరుతున్నట్లు వారి తల్లిదండ్రులు దామ పద్మావతి చిన్న ఓబులేష్ తెలిపారు. కార్యక్రమంలో మల్దకల్ పద్మశాలి కుల సంఘం అధ్యక్షులు నీలి వెంకటన్న, దామ వెంకటేష్, క్యామ శివ, పద్మశాలి కుల బాంధవులు, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



# ముడుపులు ముడితేనే పనులు..

- త్వరలోనే ఎమ్మెల్యే చిట్టెం బండారం బయటపెడ్తాం..
- విలేకరుల సమావేశంలో అధికారి పార్టీ అసమ్మతి నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి పార్టీ అసమ్మతి నేతలు

**నారాయణపేట ప్రతినిధి, సెప్టెంబరు8 ప్రభాతవార్త:** ప్రతి పనికి ముడు పులు ముట్టనిదే ఫైలు ముందుకు కదలదని, ఎమ్మెల్యే చరిత్ర అంతా నియోజకవర్గ ప్రజలకు తెలుసని త్వరలోనే ఆయనకు తగిన బుద్ధి చెబుతాం'అని బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ,వర్కటం జగన్నాథం, లక్ష్మారెడ్డి, నీలప్ప ముదిరాజ్ ఆరోపించారు. ఈమేరకు మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గురువారం నర్వ మండలం కొత్తపల్లిలో చేపట్టిన గొర్రెల పంపిణీ కార్య క్రమంలో ఎమ్మెల్యే హాజరై పలువురిని వ్యక్తిగతంగా దూషించడం తగదని హితువు పలికారు. ప్రజలు ఏ పని మీద హైదరాబాద్‌కు వచ్చినా ఎమ్మెల్యే సతీ మణి లెటర్‌ప్యాడ్ లేనిదే పనులు జరగవని ఆరోపించారు. ముందుగా లంచం ముట్టినాకే పనులు అవుతాయని చెప్పారు. సంగంబండ ప్రజలను తిట్టడం కులం పేరుతో దూషించడం ఎమ్మెల్యేకు అలవాటు అయ్యిందని ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు తండ్రి పేరు పెట్టుకున్నారని, కానీ కనీసం నష్టపరిహారం కూడా చెల్లించలేదని పరిస్థితి ఉందని, కెనాల్ పనులు పూర్తి చేస్తే ఏడు గ్రామాల ప్రజలకు సాగునీరందుతుందని, కనీసం ఆ పనులు కూడా పూర్తి చేయని ఎమ్మెల్యే ఉండడం ఇక్కడి ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమన్నారు. ప్రతి పథకాన్ని ఎంత వసూలు చేశారో, నీ వెంట ఉండే నాయకులు ఎంత వసూలు చేశారో, దళితబంధు పథకంలో రూ.3లక్షలు వసూలు చేసింది మొత్తం బయటపెడ్తామని ఆరోపించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ సునీతా గోపాల్‌రెడ్డి, ముష్టి రవికుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డంపల్లి హనుమంతు, మాజీ ఎంపీపీ శివరాంరెడ్డి, శివరామరెడ్డి, రవికుమార్, రాములు, గణేశ్ పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

**మహ్మదాబాద్, సెప్టెంబరు8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్ నంచర్లలో మండల స్థాయి కబడ్డి టోర్నమెంట్ ప్రారంభించి తదుపరి జిల్లా స్థాయి కబడ్డి పోటీల కోసం ఎంపికలు జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ కెఎం అనసూయ నారాయణ, ఉపసర్పంచ్ పావని వెంకటేష్‌లు హాజరై కబడ్డి పోటీలు ప్రారంభించారు. క్రీడాకారుల పరిచయాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ అనసూయ నారాయణ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. విద్యార్థులు కేవలం చదువుతోనే కాకుండా ఆల్ రౌండర్‌గా ఎదిగి జీవితంలో ఉన్నతమైన వ్యక్తులుగా జీవించేందుకు విద్యార్థి దశ ఎంతో తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. కబడ్డి పోటీలలో విజేతలుగా అండర్ 14 బాలుర విభాగంలో విన్నర్స్ జడ్పీహెచ్ఎస్ నంచర్ల, రన్నర్స్ జడ్పీహెచ్ఎస్ బాలుర మహ్మదాబాద్, బాలికల అండర్ 14 కబడ్డి పోటీలలో విన్నర్స్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నంచర్ల, రన్నర్స్‌గా కెజిబివి మహ్మదాబాద్ విజేతలుగా నిలిచారు. అండర్ 17 కబడ్డి బాలుర విభాగంలో విన్నర్స్‌గా జడ్పీహెచ్ఎస్ నంచర్ల రన్నర్స్‌గా జడ్పీహెచ్ఎస్ బాలుర మహ్మదాబాద్ అండర్ 17 బాలికల విభాగంలో విన్నర్స్‌గా తెలంగాణ సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాల నంచర్ల, రన్నర్స్‌గా జడ్పీహెచ్ఎస్ బాలికలు మహ్మదాబాద్ విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన జట్లకు సాయంత్రం బహుమతి ప్రధానోత్సవం జరిపారు. మండల స్థాయి పోటీలలో పాల్గొన్నక్రీడాకారులకు హాజరైనఅతిథులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించిన ఉపసర్పంచ్ పావని వెంకటేష్ క్రీడాకారులకు క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనంద్‌కుమార్, ఎంపిటిసి పద్మమమ, ఎస్ఎంసి ఛైర్మన్ కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌బాబు, పీఈటీలుఆంజనేయులు, నాగమణి, రాంచందర్, వనమాల స్వరూప, శ్రీనివాస్ సత్యనారాయణ, గ్రామయువకులు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతుల ప్రదానం చేసిన దృశ్యం

# నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయం : ఎమ్మెల్యే

**అయిజ, సెప్టెంబరు08 ప్రభాతవార్త:** వర్గాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి తమ ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే అబ్రహాం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మేడికొండ గ్రామంలో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులు ఎమ్మెల్యే డా.విఎం అబ్రహాం స్థానిక బిఆర్ఎస్ నాయకులు లక్ష్మింకాంతరావుతో కలిసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కళ్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్, రైతుబంధు, రైతు భీమా, దళితబంధు, గృహలక్ష్మి పథకాలు ప్రవేశపెట్టి ప్రజల బాంధవుడు అయ్యాడని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి పెట్టిన పథకాలే టిఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల పరిసర ప్రాంత ప్రజలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం

## సల్లంగా చూడు గంగమ్మ తల్లి

### వైభవంగా గంగమ్మ తల్లికి జలాభిషేకం



**చిన్నచింతకుంట, సెప్టెంబరు 08 ప్రభాతవార్త :** సకల మానవాళికి ఆధారమైన గంగా జలాలకు ప్రతిరూపమైన శ్రీ గంగాభవాని జలాభిషేకాన్ని ముదిరాజ్ కులస్తులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లిని కొలుస్తారు. ప్రతిఏటా శ్రావణమాసం చివరి శుక్రవారం ఆత్మకూర్ మండలం జూరాల గ్రామం వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనంలో పవిత్ర జలాలను గ్రామ సమీపంలోకి తీసుకురాగానే ముదిరాజ్ కులస్తులు మహిళలు బ్యాండ్ మేళాలు, మంగళ హారతులతో పవిత్ర జలాలకు స్వాగతం పలికి శోభాయాత్ర నిర్వహించారు. అడుగడుగునా ముదిరాజ్ కులస్తులు భజన కీర్తనలతో భక్తి భావాన్ని నింపారు. పవిత్ర జలాలను ఆలయానికి చేర్చి శ్రీ గంగాభవాని మాత విగ్రహానికి పవిత్ర జలాలతో జలాభిషేకం అనంతరం అమ్మవారికి వెండి ఆభరణాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తిమాత సల్లంగా చూడు గంగమ్మ తల్లి అంటూ ముదిరాజ్ కులస్తులు వేడుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి అఖండ భజనలు చేశారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీచేస్తా ఆశీర్వదించండి

- మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, సెప్టెంబరు8 ప్రభాతవార్త:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున నారాయణపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటానని పార్టీ అధిష్టానం కూడా తనకే టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని మాజీ డిసిసి అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంఛార్జి కుంభం శివకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కుంభం శివకుమార్‌రెడ్డి అధ్యక్షతన నారాయణపేట డిసిసి కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంనిర్వహించారు. సమావేశానికికార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

## టెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

### మహబూబ్‌నగర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** ఈనెల 15 నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఈనెల 15న ఉదయం ఉదయం 9.30 గం.లనుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు మధ్యాహ్నం 12.30 గం.ల నుండి సాయంత్రం 5 గం.లవరకు 58 పరీక్ష కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 18720 మంది, మధ్యాహ్నం 13,920 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని ఇందుకుగాను ఆయా శాఖల అధికారులు అవసరమైన అన్నిఏర్పాటు చేయాలనిచెప్పారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధింపుతో పాటు, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పోలీసులు పరీక్ష నిర్వహించే రోజున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ తరపున అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎఎన్ఎంలను ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ పరిశుభ్రతతో పాటు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలని, ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడపాలని, అంతేకాక బస్టాండ్‌లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసిఏబస్సులు ఎక్కడికి వెళ్తున్నాయో తెలియజేయాలని, ఆర్టీఏ అవసరమైన వాహనాలను ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు 136 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని 13 రూట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిందర్, రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నరేష్, ఆర్టీసి డిపో మేనేజర్ సుజాత, ట్రాన్స్‌కో డిఇచంద్రశేఖర్, పోలీస్, రెవెన్యూ ఇతర అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

## కోయిల్‌సాగర్‌కు జలకళ

- -30.6 ఫీట్లకు చేరిన నీటిమట్టం
- -ఇంకా 1.9 నీరు వస్తే షెట్టర్లు తెరిచే అవకాశం
- -జూరాల నుండి ప్రాజెక్టుకు నీటిపరఫరా నిలిపివేత


నీటితో కళకళలాడుతున్న కోయిల్‌సాగర్

**దేవరకద్ర, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల కోయిల్‌సాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం పెద్దఎత్తున నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 30.6 ఫీట్లకు చేరింది. తీలేర్ పంప్ హౌజ్ ద్వారా కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు తరలించడం ఆపేశారు. ప్రాజెక్టు నుండి ఆయకట్టుకు నీటిని సరఫరాను కూడ నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం త్వరగా పెరగడానికి ఆస్కారమేర్పడుతుంది. వర్షాలు కురవడం మళ్ళీ ప్రారంభం కావడంతో ప్రాజెక్టులోని వచ్చి చేరే వాగుల నుండి నీరు రావడం ప్రారంభమైంది. ప్రాజెక్టులో నీరుపాతఅలుగు స్థాయిని 6రోజుల క్రితమే దాటిపోయింది. ప్రాజెక్టులో కనుచూపుమేర నీరే కనిపిస్తుంది. చల్లని గాలి, చుట్టూ పర్వతాలు..నీటిఅలలు...ప్రాజెక్టు వద్దకు వచ్చే పర్యాటకులను మైమరపిస్తున్నాయి. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 1.9 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుగుతుంది.

## గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు

**ఇటిక్యాల, సెప్టెంబరు 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరు గ్రామంలో పోషణ్ అభియాన్ మాసంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గర్భవతులకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎఎన్ఎం నర్మద మాట్లాడుతూ మహిళ గర్భవతిగా ఉన్నప్పుడు మానసిక ఆందోళన చెందకుండా సంతోషంగా ఉండేందుకుగాను గర్భవతులకు సామూహిక సీమంతాలు జరపడం జరిగిందని ప్రతి గర్భవతి పోషకవిలువలుఉండే ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచిస్తూ గర్భవతులకు శ్రీమంతంలో భాగంగా పూలు, పండ్లు, మిఠాయిలుఇతర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోతహసిల్దార్‌వెంకటేశ్వర్లు, ఆర్ఐలు సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శిమస్తాన్, గ్రామపెద్దలు, సామూహిక శ్రీమంతాలకార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడిటీచర్లు, ఆశాకార్యకర్తలు, ఆయాలు, గర్భవతులు పాల్గొన్నారు.

